

ప్రైవేట్.. వద్దు సర్కారు బడే ముద్దు

బడిబాట కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం కంది మండలంలోని కంది, కాశీపూర్, చెర్లగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. కందిలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలకు అన్నింటికంటే ముఖ్యమైనది చదువేనని, ప్రతీరోజు పిల్లలు బడికి వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

7లో



హబ్‌కు జబ్బు!

టీ-డయాగ్నోస్టిక్ హబ్‌లో పరీక్షలకు బ్రేక్



- రెండ్రోజులుగా బయోకెమిస్ట్రీ మిషన్ బ్రేక్‌డౌన్
- వినియోగంలో వచ్చేందుకు మరో రెండ్రోజులు!
- రోగ నిర్ధారణ పరీక్షల కోసం బయటికి..
- రోగులకు తప్పని ఇబ్బందులు



సంగారెడ్డి అర్బన్, జూన్ 14 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని టీ-డయాగ్నోస్టిక్ హబ్‌కు జబ్బు చేసింది. వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించే బయోకెమిస్ట్రీ మిషన్ బ్రేక్‌డౌన్ అయింది. దీంతో రెండు రోజులుగా ఆ యంత్రంలో చేసే రోగ నిర్ధారణ పరీక్షలన్నీ నిలిచిపోయాయి. మరమ్మతులు చేసి వినియోగంలోకి రావడానికి మరో రెండు రోజులైనా పట్టవచ్చని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అసలు టీ-హబ్‌లోని యంత్రాలు ఎప్పుడు పనిచేస్తాయో? ఎప్పుడు మొరాయిస్తాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. బయోకెమిస్ట్రీ మిషన్ తరుచూ బ్రేక్‌డౌన్ కావడం ఇక్కడ పరిపాటిగా మారింది. దీంతో రోగులు, ప్రజలు వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

134 రకాల పరీక్షలు

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వివిధ రకాల పరీక్షలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2021లో తెలంగాణ డయాగ్నోస్టిక్స్ డిస్ట్రిక్ట్ హబ్(టీ-హబ్) పేరిట సంగారెడ్డిలో ఓ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ క్రమంలో 57 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోగా, ఆ తర్వాత 2023 జూలై 1న పరీక్షల సంఖ్యను 134కు పెంచారు. ఉచిత టెస్టులతో పేదలకు ఆర్థిక భారం నుంచి ఊరట దక్కుతుందని భావించిన సర్కారు చర్యలు తీసుకున్నది. సంగారెడ్డి జీజీహెచ్, ఎంసీహెచ్‌తో పాటు జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల నుంచి నిత్యం ప్రత్యేక వాహనంలో శాంపిళ్లు ఇక్కడికి తీసుకొస్తారు. వాటిని టీ-హబ్‌లోని ఆధునాతన యంత్రాల్లో పరీక్షలు జరిపి రోగి సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో నిర్ధారణ ఫలితాల రిపోర్టును పంపుతున్నారు.

ప్రధాన పరీక్షలకు బ్రేక్

టీ-హబ్‌లో బయోకెమిస్ట్రీ మిషన్ యంత్రం మొరాయించడంతో ప్రధాన పరీక్షలు నిలిచిపోయాయి. కిడ్నీ, లివర్ ఫంక్షనింగ్(ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ), ఎలక్ట్రోలైట్స్, కొలెస్ట్రాల్, షుగర్, పచ్చకామెర్లు, సిరం క్రియాటిన్, బ్లడ్ యూరియా, యూరిక్ యాసిడ్, సీఆర్‌పీ ఇలా బయోకెమిస్ట్రీకి సంబంధించిన 56 పరీక్షలు నిలిచిపోయాయంటే పరిస్థితి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షలు నిలిచిపోవడంతో పలు రకాల సర్జరీలు వాయిదా వేసినట్టు తెలిసింది. అంతే కాకుండా రోగ నిర్ధారణ చేసుకోలేక పలువురు రోగులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి లేకపోలేదు. జీజీహెచ్, ఎంసీహెచ్‌కి సంబంధించి కొన్ని పరీక్షలు అత్యవసరముంటే కింది ల్యాబ్‌లో మ్యాన్యువల్‌గా చేస్తున్నారు. ఇక జిల్లావ్యాప్తంగా వివిధ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల నుంచి శాంపిళ్లు పంపవద్దని ముందే సమాచారం చేరవేశారు. యంత్రం బ్రేక్ డౌన్ కావడంతో గురువారం శాంపిళ్లు హైదరాబాద్‌లోని కొండాపూర్ టీ-హబ్‌కు నిర్ధారణకు పంపినట్టు తెలిసింది. జిల్లాలో తరచూ ఇలాంటి పరిస్థితే ఎదురవుతుండడం గమనార్హం

బ్రేక్‌డౌన్‌పై అనుమానాలు

టీ-హబ్‌లోని బయోకెమిస్ట్రీ మిషన్ యంత్రం తరుచూ మొరాయించడం అనుమానాలకు తావిస్తున్నది. నెలలో కనీసం రెండు, మూడుసార్లు బ్రేక్ డౌన్ కావడం జరుగుతున్నదని ఆ వర్గాలు తెలిపాయి. అయితే నిజంగానే యంత్రం మొరాయిస్తుందా? లేక మొరాయించేలా ఏమైనా చేస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యంత్రం మొరాయించడం వల్లా కనీసం తిరిగి వాడుకలోకి వచ్చేందుకు రెండు, మూడు రోజుల సమయం పడుతుంది. ఈ రకంగా దశలవారీగా రెండు మూడుసార్లు మొరాయిస్తే నెలలో సుమారు 8-10 రోజుల పాటు పరీక్షలు నిలిపేస్తున్నారు. ఈ కారణంతో జిల్లాలోని వివిధ ఆస్పత్రుల నుంచి శాంపిళ్లను తీసుకొచ్చే ప్రత్యేక వాహనాలు కూడా అరకొరగా హబ్‌కు రప్పిస్తారు. దీంతో కాంట్రాక్ట్ పొందిన వాహనాల యజమానికి లబ్ధి చేకూర్చడంతో పాటు ఆస్పత్రి బయట ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులకు ప్రయోజనం చేకూర్చేందుకు బ్రేక్‌డౌన్ అంటూ ఎత్తుగడ వేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ల్యాబ్ నిర్వాహకుడి పాత్రపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజుల పసికందుతో బయటికి..



సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో పుల్‌కల్ మండలం ఇటిక్యాలకు చెందిన అఖిల అనే మహిళకు ఈ నెల 12న సీజేరియన్ ప్రసవం ద్వారా ఆడబిడ్డ జన్మించింది. డాక్టర్లు శుక్రవారం పసికందును పరిశీలించి పచ్చకామెర్ల పరీక్ష చేయించాలని కుటుంబసభ్యులకు సూచించారు. దీంతో పసికందును తీసుకొని ల్యాబ్‌కు వెళ్లగా పరీక్షల మిషన్లు పాడైనాయని బయటికి వెళ్లి చేయించుకోవాలని అక్కడి ల్యాబ్ సిబ్బంది సూచించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆస్పత్రి పక్కన ఫలానా ల్యాబ్‌కు కూడా వెళ్లాలని పేరుతో సహా సిబ్బంది సూచించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు.. మూడు రోజుల పసికందును తీసుకొని ఆస్పత్రి బయటి ల్యాబ్‌కు వెళ్లడం గమనార్హం.



సంగారెడ్డి డీఈవో కార్యాలయంలో ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న కమిటీ

ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన

ఎస్‌ఏ బదిలీల తుది జాబితా నేడు వెల్లడి

సంగారెడ్డి అర్బన్, జూన్ 14 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్ సబ్జెక్టుల పదోన్నతి కోసం అర్హులైన ఎస్జీటీ ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని శుక్రవారం డీఈవో కార్యాలయంలో నిర్వహించారు. ఇప్పటికే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే. స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియకు సంబంధించి తుది జాబితాను నేడు వెల్లడించనున్నారు.

ఫిట్‌నెస్ లేని 40 స్కూల్ బస్సులు సీజ్

సంగారెడ్డి జిల్లాలో ముమ్మర తనిఖీలు



కంది శివారులో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

కంది, జూన్ 14 : ఫిట్‌నెస్‌లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారి అరుణ ఆధ్వర్యంలో ఆర్టీఏ అధికారులు శుక్రవారం స్కూల్ బస్సులను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలో 1,214 స్కూల్ బస్సులు ఉండగా వీటిలో 250 బస్సులకు ఫిట్‌నెస్ లేదని గుర్తించారు. ఇందులో 40 బస్సులకు సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్‌చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా, ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యాలు స్కూల్ బస్సులను తప్పనిసరిగా తనిఖీ చేయించుకుని అనుమతులు పొందాలని సూచించారు. ఫిట్‌నెస్, ధ్రువపత్రాలు, డ్రైవర్లకు హెవీ లైసెన్సులు, బ్యాడ్జ్ నంబర్ కచ్చితంగా కలిగి ఉండాలన్నారు.

● కౌడిపల్లి : మెదక్ జిల్లాలో ఓ స్కూల్ బస్సును అధికారులు సీజ్ చేశారు. ఆర్టీఏ అధికారులు శుక్రవారం మండలంలోని ధర్మసాగర్ గేట్ సమీపంలోని బస్సులను తనిఖీ చేశారు. డాన్‌బాస్కో పాఠశాల బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడంతో సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రైతులను సమావేశానికి పిలిచి..

అధికారులే రాలేదు!

రీజినల్ రింగురోడ్డు కోసం భూములు త్యాగం చేస్తే నిర్లక్ష్యమా?.. రైతుల ఆగ్రహం

కలెక్టరేట్‌లో అత్యవసర సమావేశం ఉండటంతో వెళ్లాల్సి వచ్చింది : ఆర్డీవో



అధికారులు రాకపోవడంతో ఎదురుచూస్తున్న రైతులు, సిబ్బంది



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఆర్డీవో


నర్సాపూర్, జూన్ 14: రీజినల్ రింగురోడ్డు కోసం భూసేకరణ చేయనున్న రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అధికారులు హాజరుకాకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని శివ్వంపేట మండలంలో రీజినల్‌రింగు రోడ్డు కోసం భూములు కోల్పోయే రైతులతో అధికారులు శుక్రవారం నర్సాపూర్‌లోని రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు హాజరవుతారని సమాచారమిచ్చారు. దీంతో పోతులబోగుడ, కొత్తపేట, పాంబండ, లింగోజిగూడ, గుండ్లపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు వ్యయప్రయాలకోర్చి నర్సాపూర్‌కు వచ్చారు. అయితే, సమావేశానికి ఆర్డీవో, ఇతర ఉన్నతాధికారులు రాలేదు. కిందిస్థాయి సిబ్బంది మాత్రమే రావడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన భూములను రీజినల్ రింగురోడ్డు కోసం త్యాగం చేస్తున్నా అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం విచారకరమని వాపోయారు. తమను రమ్మని పిలిచి.. అధికారులు రాకపోవడమేమిటని మండిపడ్డారు. దీనిపై సిబ్బంది స్పందిస్తూ ఆర్డీవోకు కలెక్టరేట్‌లో సమావేశం ఉండటంతో హాజరుకాలేకపోయారని తెలిపారు. అయితే, అధికారులు లేకపోవడంతో ఉన్న సిబ్బందికే రైతులు తమ సమస్యలను మొరపెట్టుకుని, రాతపూర్వకంగా విన్నవించారు.

కలెక్టరేట్‌లో సమావేశం ఉండడంతోనే..

రీజినల్ రింగురోడ్డు కోసం భూములు కోల్పోయే రైతులతో సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ, అదే సమయంలో కలెక్టరేట్‌లో అత్యవసర సమావేశానికి హాజరుకావాల్సి వచ్చిందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వివరించారు. కలెక్టరేట్‌లో సమావేశం పూర్తికాగానే నర్సాపూర్‌కు వచ్చి, రైతులతో మాట్లాడానని తెలిపారు. వారి అభ్యంతరాలను తెలుసుకుని లిఖితపూర్వకంగా దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. విచారణ చేసి తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

‘సేఫ్’ ఆటోలనే అనుమతిస్తాం

- స్టిక్కరింగ్ లేకుండా జిల్లాలో నడపొద్దు
- సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు
- జిల్లా క్రైం రివ్యూ మీటింగ్‌లో సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి క్రైం, జూన్ 14 : పోలీసులు గుర్తించి అందజేసిన ‘మై ఆటో ఈజ్ సేఫ్’ స్టిక్కరింగ్ లేని వాహనాలు జిల్లాలో తిరగడానికి అనుమతించబోమని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆయన పోలీసు అధికారులతో క్రైమ్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సైబర్ నేరాలపై కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా చైతన్యం కలిగించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనవారు వెంటనే 1930 నంబర్‌కు లేదా, సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జంతువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, జంతువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

వనదుర్గా ప్రాజెక్టులో మునిగి ఒకరి మృతి

పాపన్నపేట, జూన్ 14 : ఏడుపాయల ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టులో ప్రమాదవశాత్తు మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ నరేష్ తెలిపిన కథనం ప్రకారం.. హైద్రాబాద్‌కు చెందిన ఎస్లీ వినోద్(48) వంట మనిషిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వనదుర్గమ్మ దర్శనం కోసం కుటుంబసభ్యులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. శుక్రవారం సాయంత్రం సమయంలో వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. స్నానం చేసేందుకు వినోద్ ప్రాజెక్టులోకి దిగగా, ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. ఎంత సేపటికీ రాకపోవడంతో కుటుంబీకులు, స్థానికుల సాయంతో నీటిలో వెతికారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వినోద్‌కు భార్య లత, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్‌క్వాస్‌కు ఎంపికైన పొడిచన్‌పల్లి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

పాపన్నపేట, జూన్ 14 : నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ ప్రోగ్రాం(ఎన్‌క్వాస్)కు పొడిచన్‌పల్లి పీహెచ్‌సీ ఎంపికైనట్లు జిల్లా వైద్య అధికారి శ్రీరాం శుక్రవారం ప్రకటించారు. ఆయన వైద్యుడు నవీన్‌తో కలసి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎంపికైన ఆసుపత్రుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ దీక్ష, శ్రీనివాస్‌రెడ్డి, ఇందిర, పల్లవి, భద్రప్ప, భూమేష్ తదితరులు ఉన్నారు.

ఏఆర్‌టీలో ఉద్యోగాలకు 18 న రాత పరీక్ష

సంగారెడ్డి అర్బన్, జూన్ 14: సంగారెడ్డి జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్, డేటా మేనేజర్, ఫార్మాసిస్ట్ పోస్టులకు 18న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు ఇదివరకే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. డేటా మేనేజర్, ఫార్మాసిస్ట్ పోస్టులకు మాత్రం రాత పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల వరకు మెడికల్ కాలేజీ-జీజీహెచ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

పంచాయతీ విభజన సమస్యపై అభిప్రాయ సేకరణ



ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న గడ్డపోతారం వాసులు

జిన్నారం, జూన్ 14 : గడ్డపోతారం పంచాయతీ విభజనపై ఎంపీడీవో అరుణ, ఎంపీవో సంతోష్, గడ్డపోతారం, అల్లీనగర్, కిష్టాయ్యపల్లి గ్రామాల్లోని ప్రజలు, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల గడ్డపోతారం పంచాయతీ నుంచి కిష్టాయ్యపల్లిని వేరు చేయాలని కొందరు గ్రామస్థులు విన్నవించగా, కలిసే ఉంటామని మరికొందరు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలోని అల్లీనగర్‌ను ప్రత్యేక పంచాయతీ చేయాలంటూ అధికారులకు విన్నవించారు. ఒక పంచాయతీలో మూడు అభిప్రాయలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీడీవో మూడు గ్రామాల్లో విడిగా సమావేశాలు నిర్వహించి, స్థానిక నాయకులు, ప్రజల అభిప్రాయాలు సేకరించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేసి, వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

మూతపడిన బడి ప్రారంభం

అలిరాజపేటలో తెరుచుకున్న ప్రాథమిక పాఠశాల



అలిరాజపేటలో పాఠశాల ప్రారంభ కార్యక్రమంలో ఎంఈవో తదితరులు

జగదేవ్‌పూర్, జూన్ 14 : కరోనా సమయంలో మూసివేసిన మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వం మూసివేసిన పాఠశాలలను పునఃప్రారంభించాలని ఆదేశించడంతో మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్థులు సమావేశమై చర్చించిన తర్వాత పాఠశాలలను తెరవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మాధవరెడ్డి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సైదులు, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి సీఆర్‌పీ దయానంద్, ఐఈఆర్‌పీ కరుణాకర్ పాల్గొన్నారు.

తెరుచుకున్న ఎస్సీ హాస్టల్

మద్దూరు, జూన్ 14 : మండల కేంద్రంలో గత విద్యాసంవత్సరం మూతపడిన ఎస్సీ హాస్టల్ తెరుచుకున్నది. గతంలో ఇక్కడ పని చేసిన వార్డెన్లు సక్రమంగా రాకుండా రికార్డుల్లో విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపుతూ.. మెను ప్రకారం భోజనం, కాస్మొటిక్ ఛార్జీలను అందించకపోవడంతో క్రమేపీ విద్యార్థులు హాస్టల్‌కు దూరమయ్యారు. విద్యార్థుల పర్యవేక్షణ, వార్డెన్ పనితీరుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా సాంకేతిక లోపంతో పనిచేయకుండా పోయాయి. దీంతో ఎస్సీ హాస్టల్ మూతపడింది. చిన్నకోడూరు హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న రవిని ఇన్‌చార్జి వార్డెన్‌గా అసిస్టెంట్ సోషల్ వేల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణ రెండు రోజుల క్రితం నియమించారు. దీంతో వసతి గృహాన్ని శుక్రవారం పునఃప్రారంభించారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడికి డాక్టరేట్

మునిపల్లి, జూన్ 14 : మునిపల్లిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు జి.మంగూత్ డాక్టరేట్‌ను పొందారు. మంగూత్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో 'యాదాద్రి భువనగిరి జిల్లాలో వ్యవసాయంపై రైతుబంధు పథకం ప్రభావం' అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేయగా విశ్వవిద్యాలయం మంగూత్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మంగూత్ డాక్టరేట్ పొందడటం పట్ల ఆదర్శ పాఠశాల అధ్యాపక బృందం శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. కాగా, ఆదర్శ పాఠశాలలో పదవ తరగతిలో పదికి పది శాతం జీపీఏ సాధించిన విద్యార్థి రామ్ శ్రీజను ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.



హైదరాబాద్‌లో రాజ్‌భవన్ కమ్యూనిటిహాల్‌లో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్

రక్తదాతకు రాష్ట్రస్థాయి అవార్డు

కల్హేర్, జూన్ 14 : సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వోతె చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి ఉత్తమ రక్తదాత అవార్డును అందుకున్నారు. 52 సార్లు రక్తదానం, కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో ప్లాస్మా దానం చేసిన చంద్రశేఖర్‌కు హైదరాబాద్ రాజ్‌భవన్ కమ్యూనిటీహాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్‌షెట్కార్ ఉత్తమ రక్తదాత అవార్డును అందజేశారు. చంద్రశేఖర్‌ను మంత్రి, ఎంపీ అభినందించారు.

పిల్లలను చదివించే స్థోమత లేదు..

- మండల లీగల్ కమిటీని ఆశ్రయించిన ఒంటరి మహిళ
- జడ్జి చొరవతో చదివించేందుకు ముందుకు వచ్చిన నలంద స్కూల్ యజమాన్యం

నర్సాపూర్, జూన్ 14: ఇద్దరు పిల్లలను ఆర్థిక ఇబ్బందులతో చదివించలేకపోతున్నానని, తగిన సహాయం చేయాలని ఓ ఒంటరి మహిళ మండల లీగల్ కమిటీని ఆశ్రయించగా.. జడ్జి చొరవతో ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం చదివించేందుకు ముందుకు వచ్చింది. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్‌లో నివసించే టి.కావ్యకు ఇద్దరు పిల్లలు.. తనకంటు ఎవరు లేకపోవడంతో కష్టపడి పిల్లలను పోషికుంటుంది. వారిని చదివించే స్థోమత లేకపోవడంతో ఆమె మండల లీగల్ కమిటీ ద్వారా నర్సాపూర్ న్యాయస్థానంను ఆశ్రయించింది. జడ్జి కె.అనిత వెంటనే స్పందించి శుక్రవారం ఈ విషయమై స్థానిక నలంద స్కూల్ యజమాని పీఎస్ రెడ్డిని పిలిపించి పిల్లల విషయమై వివరించారు. ఉచితంగా తన స్కూల్‌లో చదివించేందుకు ఒప్పుకుని వెంటనే పాఠశాలలో చేర్పించుకున్నాడు. దీంతో జడ్జి స్కూల్ యజమాని పీఎస్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఒంటరి మహిళకు న్యాయవాది స్వరూప సహకరించారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

- ప్రణాళికతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోదన
- పిల్లలు బడికి వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి
- బడిబాట కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, జూన్ 14 : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నిపుణులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. విద్యార్థులకు చదువుతోనే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కంది, కాశీపూర్, చెర్లగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. కందిలో విద్యార్థులకు సాముహిక అక్షరాభ్యాసం చేయించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులపై ఆరా తీశారు. పాఠశాలల్లోని తరగతి గదులను, పరిసరాలను, మధ్యాహ్న భోజన నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్‌లు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కంది ప్రాథమిక పాఠశాలకు ఫర్నిచర్, వాల్‌పెయింటింగ్, ఆట వస్తువులు సమకూర్చిన దాత బుగ్గన్నగారి కాశీనాథ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళా సంఘాలతో విద్యార్థుల యూనిఫాంలను కుట్టిస్తున్నామన్నారు. పాఠశాల పనులలో అందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. చక్కటి ప్రణాళికతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోదించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు తరచూ తల్లిదండ్రులతో సమావేశమై విద్యార్థులకు అందిస్తున్న భోదన, పిల్లలు కనబరుస్తున్న ప్రతిభను వివరించాలని సూచించారు. పిల్లలు ఎక్కువ రోజులు సెలవులు పెడితే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని, ప్రతీరోజు పిల్లలు బడికి వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పిల్లలకు అన్నింటి కంటే ముఖ్యమైనది చదువేనని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటనర్సింలు, కార్యదర్శి విద్యాధర్‌గౌడ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

'ధరణి' సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

మెదక్ అర్బన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 14 : ప్రత్యేక కార్యాచరణ ద్వారా ధరణి సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపలి, జగిత్యాల కలెక్టర్లతో పెండింగ్ ధరణి సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కంటే ముందు గత మార్చి 1 నుంచి 15 వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 1.38 లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తుల రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి జీఎల్ఎంటీఎం 33 దరఖాస్తుల్లో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పు చేస్తున్నామన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతీ మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూసంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేశామని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో 13 వేల దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయని మండలాలవారీగా ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రత్యేకంగా సమీక్షిస్తూ పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఆన్‌లైన్ రిపోర్ట్ పంపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మెదక్ కలెక్టరేట్‌లో పాల్గొన్న అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని ధరణి పెండింగ్ దరఖాస్తులను ప్రణాళికబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. కమిషనర్ సూచనల ప్రకారం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన తర్వాత పరిష్కరించాలన్నారు. ప్రతీ మండలంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన భవనం, భూమి కేటాయించి ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మెదక్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, ఏవో, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, జిల్లా ధరణి కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.





మెదక్ కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి

చౌటకూర్‌లో నాలుగు ఇళ్లల్లో చోరీలు

- రూ.ఐదు లక్షలు నగదు, బంగారం, వెండి నగలు అపహరణ
- ఇళ్లను పరిశీలించిన జోగిపేట సీఐ.. ఆధారాలు సేకరించిన క్లూస్ టీం



చౌటకూర్‌లో చోరీ జరిగిన ఓ ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పుల్‌కల్, జూన్ 14 : మండల కేంద్రం చౌటకూర్‌లో గురువారం అర్ధరాత్రి దొగలు బీభత్సం సృష్టించారు. నాలుగు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి.. రూ.ఐదు లక్షలు నగదుతో పాటు బంగారం, వెండి నగలను దోచుకెళ్లారు. పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అంతయ్యోళ్ల రాధయ్యకు పెంకుటిల్లు, రేకుల ఇళ్లు ఉన్నాయి. రాధయ్య కుమారుడు పెంకుటింట్లో నివాసం ఉండగా, రాధయ్య రేకుల ఇంట్లో ఉంటున్నారు. రాధయ్య గురువారం రాత్రి పొలానికి కాపలగా వెళ్లగా ఆయన భార్య ఒక్కరు ఉండటంతో కుమారుడి ఇంట్లో పడుకున్నారు. రేకుల ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి తాళం వేసిన బీరువాను ధ్వంసం చేసి రూ.లక్షా 50 వేలు నగదు, పది గ్రాముల బంగారు గుండ్లు, ఐదు గ్రాముల కమ్మలు, 24 తులాల వెండి పట్టీలు, రెండు వెండి గ్లాసులను అపహరించారు. అదే గ్రామానికి చెందిన రంగోల్ల నాగమణి ఊరికి వెళ్లగా, ఇంటి తాళం పగులగొట్టి రూ.రెండు లక్షలు నగదు, రెండు తులాల పుస్తెల తాడు, తులం కమ్మలను అపహరించారు. ఆవంచ శంకరయ్య ఇంటికి తాళం వేసి ఆరుబయట నిద్రిస్తుండగా, తాళం పగులగొట్టి రూ.లక్షా 50 వేలు నగదు, తులంన్నర గుండ్లు, తులం కమ్మలు ఎత్తుకెళ్లారు. రంగోల్ల శ్రీనివాస్ ఇంట్లో చొరబడ్డారు. ఇంట్లో ఏమి దొరకకపోవడంతో 20 వేల రూపాయల ప్రామీసరి నోట్ పత్రాన్ని దొంగిలించారు. ఒక్కరోజే నాలుగు ఇళ్లల్లో చోరీ జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై బాధితులు పుల్కల్ పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ కె.శ్రీకాంత్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్ బాధితుల ఇళ్లను పరిశీలించారు. వెంటనే క్లూస్ టీంను రప్పించగా, వారు ఆధారాలను సేకరించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి

- బర్త్‌డే వేడుకలు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా గుమ్మడిదలలో ఘటన

గుమ్మడిదల, జూన్ 14 : స్నేహితులతో కలిసి తన బర్త్‌డే వేడుకల్లో పాల్గొని తిరిగి ఇంటికి వెళ్తున్న తరుణంలో మృత్యువు వెంటాడింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న దుర్ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శుక్రవారం గుమ్మడిదల గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాలకు వెళ్తే.. గుమ్మడిదలకు చెందిన కాసబోయిన గణేష్(21)కు గ్రామంలో బైక్ మెకానిక్ షాపు ఉంది. తనే బర్త్‌డే సందర్భంగా గురువారం అర్ధరాత్రి తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. పార్టీని ముగించుకుని తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఇంటికి వెళుతుండగా గుమ్మడిదల మండల కేంద్రంలోని మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై కానుకుంట చౌరస్తాలో కారు అదుపు తప్పి డివైడరును బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గణేష్ ఛాతికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పలువురు అక్కడికెళ్లి చూడగా అప్పటికే మృతిచెందడంతో కన్నీటి పర్వతమయ్యారు. ఇప్పటివరకు తమతో ఉన్న గణేష్ ప్రమాదంలో మృతి చెందడం పట్ల సేహితులు, కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేష్ తండ్రి కాసబోయిన కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.



మృతిచెందిన గణేష్ (ఫైల్)



డివైడర్ ను ఢీకొన్న కారు



దగ్ధమైన ప్రథమ చికిత్సాలయం, చిందరవందరగా సామగ్రి

షార్ట్ సర్క్యూట్‌తో
ప్రథమ చికిత్సాలయం దగ్ధం

చిన్నశంకరంపేట, జూన్ 14: విద్యుదాఘాతంతో ప్రథమి చికిత్సాలయం దగ్ధమైన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు రామలింగం ఉదయం చికిత్స కేంద్రానికి వచ్చిన రోగులకు వైద్యం అందించి బయటకు వెళ్లాడు. ప్రమాదవాశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో చికిత్సాలయం దగ్ధమైంది. స్థానికులు పొగలు రావడం గమనించి వైద్యుడికి సమాచారం అందించి, మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో వైద్య పరికరాలు, రూ.30వేలు నగదు కాలిబూడిదయ్యాయి. భారీ నష్టం వాటిల్లిందని ఆర్ఎంపీ వైద్యుడు రామలింగం వాపోయాడు.

డంపుయార్డులు నిరుపయోగం

- ఎరువుల తయారీ ద్వారా వచ్చే ఆదాయానికి గండి
- సేకరించిన చెత్తను కాల్చి వేస్తున్న వైనం



తిప్పనగుల్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డ్

నిజాంపేట, జూన్ 14 : గ్రామాల్లో స్వచ్ఛత దిశగా పని చేస్తున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరటం లేదు. వ్యర్థాలతో ఎరువులు తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. పల్లె ప్రాంతాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను కాల్చివేస్తూ పర్యావరణానికి ముప్పు వాటిల్లే విధంగా చేస్తుతున్నారే తప్ప డంపింగ్‌యార్డుల్లో నిర్మించిన షెడ్డులో ఎరువులు తయారు చేసే దిశగా అడుగులు వేయడం లేదు.

ఉపాధిహామీ పథకం కింద గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి ఒక డంపింగ్‌యార్డును నిర్మించింది. పల్లెప్రగతిలో భాగంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని అవగాహన కల్పించారు. అలా సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులో 45 రోజుల్లో వర్మీ కంపోస్టును తయారుచేయాలి. గ్రామ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వాడుకుని, మిగిలిన దానిని విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆలోచించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డుల ఏర్పాటు చేసి సెగ్రిగేషన్ షెడ్డులను నిర్మించారు. అయితే ఒకటీ రెండు చోట్ల తప్ప మిగతా గ్రామాల్లో వర్మీ కంపోస్టు తయారీ ప్రారంభించ లేదు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుల సమీపంలో కాల్చి వేస్తున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన వాటిని వినియోగించడం లేదు. ఎరువుల తయారీతో వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు.



సేకరించిన చెత్తను కాల్చి వేస్తున్న దృశ్యం

వర్మీ కంపోస్ట్ తయారీకి కార్యదర్శులకు ఆదేశాలు

మండలంలోని ప్రతీ గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుల ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేసేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. ఈ కంపోస్ట్ ఎరువుల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. సేకరించిన చెత్తను కాల్చి వేస్తే తగు చర్యలు తీసుకుంటాం.

- రాజిరెడ్డి, నిజాంపేట ఎంపీడీవో

డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తేవాలి

ఉపాధి హామీ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.2.50 లక్షల నిధులు మంజూరు చేస్తే పంచాయతీకో డంపింగ్‌యార్డు నిర్మాణ పనులను చేపట్టారు. మొన్నటి వరకు ఉన్న పంచాయతీ పాలకవర్గాలు నిర్లక్ష్యం కారణంగా సేకరించిన డంపింగ్‌యార్డులు నిరుపయోగంగా మారాయి. సేకరించిన చెత్తను కాల్చివేసింది. వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై శ్రద్ధ చూపలేదు. దీంతో పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని గండి కొడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు, దృష్టి సారించి డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తేవాలి

- ఆకుల రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు

నట్టల నివారణ మందులు ఇవ్వరా?

- ఏడాదిన్నరగా నిలిపివేత
- ప్రభుత్వం నుంచి సరఫరా కాని వైనం

చిన్నకోడూరు, జూన్ 14 : ఏడాదికి రెండుసార్లు జీవాల (మేకలు, గొర్రెలు)కు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు అందించేవారు. పశు వైద్యశాలల సిబ్బంది రోజుకు ఓ గ్రామానికి చొప్పున వెళ్లి ఇచ్చేవారు. సంవత్సరానికి రెండుసార్లు జనవరి, ఫిబ్రవరి మాసంలో ఒకసారి జూన్, జూలై మాసంలో మరోసారి ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యేది. 2022 వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఆ తర్వాత నుంచి నిలిచిపోయింది. కాపరులు ప్రతీరోజు పశువైద్య సిబ్బందిని అడగటం, ప్రభుత్వం నుంచి సరఫరా లేదని సిబ్బంది చెప్పడం పరిపాటిగా మారిపోయింది. మూడు పర్యాయాలు సరఫరా కావాల్సిన మందులు నేటి వరకు అందలేదు. గత జనవరి, ఫిబ్రవరిలోనైనా వస్తాయని ఎదురు చూసిన కాపరులకు నిరాశే మిగిలింది.

ఆరోగ్యంగా ఎదిగేందుకు

ప్రస్తుతం మేకలు, గొర్రెల మాంసానికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. వాటి కడుపులో నట్టలు ఉంటే అవి ఆరోగ్యంగా ఎదగలేవు. జీవాల కడుపులోని పేగుల వెంట ఉండే నాలుగు రకాల పరాన్న జీవులు వాటి రక్తాన్ని తాగుతుంటాయి. దీనితో జీవాల ఎదుగుదలను సరిగ్గా లేక మాంసం ఉత్పత్తి తగ్గిపోతుంది. నట్టల నివారణ మందులు తాగించడం ద్వారా పరాన్నజీవులు చనిపోయి ఆరోగ్యంగా బలంగా ఉంటాయి. అందుకే సంవత్సరానికి రెండు సార్లు ప్రభుత్వమే నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేస్తుంది. 2019లో పశు సంవర్ధక శాఖ అధికారులు నిర్వహించిన లెక్కల ప్రకారం చిన్నకోడూరు మండలంలో 41,061 గొర్రెలు, 9,203 మేకలు ఉన్నాయి. జీవాలకు క్రమం తప్పకుండా ఆరు నెలలకోకసారి నట్టల నివారణ మందులు ఇచ్చేవారు. ఏడాదిన్నర దాటిన జీవాలకు మందివ్వలేదని కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు



ప్రభుత్వం నుంచి నట్టల నివారణ మందులు సరఫరా కాకపోవడంతో మూడు పర్యాయాలు జీవాలకు తాగించలేదు. కావాల్సిన మందుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. అవి రాగానే జీవాలకు తాగిస్తాం.

- మంజుల, మండల పశు వైద్యాధికారిణి, చిన్నకోడూరు





ఖేడ్ పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



పటాన్‌చెరు: అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



నర్సాపూర్: హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎంఈవో

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి
- పలు పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

నారాయణఖేడ్, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి బడిబాటలో పాల్గొన్నారు. అంతకుముందు చిన్నారులచే ఎమ్మెల్యే అక్షర శ్రీకారం చేయించారు.

●**కంగ్టి:** కంగ్టి మండల పరిధిలోని తుర్కవడగాం, రాజారాంతండా పాఠశాలల్లో నిర్వహించిన బడిబాటలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని, విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి యూనిఫాం,నోట్ బుక్స్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగీతావెంకట్ రెడ్డి, జడ్పీటీసీ లలితాఆంజనేయులు పాల్గొన్నారు.

●**పటాన్‌చెరు:** ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొని చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. అనంతరం కృష్ణబృందావన్ కాలనీలో నిర్మించిన మంచినీటి సంపులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, ఎంపీపీ ఈర్ల దేవానంద్ పాల్గొన్నారు.

●**కోహీర్:** బడిబాటలో భాగంగా కోహీర్ మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో మండల విద్యాధికారి శంకర్ అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

●**సంగారెడ్డి అర్బన్:** సంగారెడ్డిలోని బాబానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**రాయికోడ్:** మండల పరిధిలోని సింగితం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఖాజామియా, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏ.ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

●**కంది:** కంది మండలం చేర్యాల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు ప్రధానోపాధ్యాయులు కసిని సుమంగళి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

మెదక్ జిల్లాలో

నర్సాపూర్, జూన్ 14: విద్యతోనే పిల్లల భవిష్యత్ బాగుంటుందని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో బుచ్యానాయక్‌తో కలిసి కొత్తగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించడంతో పాటు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

●**తూప్రాన్:** తూప్రాన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కిష్టాపూర్‌లో ప్రధానోపాధ్యాయుడు పట్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం జరిగింది.

●**కొల్చారం:** కొల్చారం మండలం రంగంపేట పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ మంజుల పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అలాగే మండల పరిధిలోని సంగాయిపేటతండాకు చెందిన గతేడాది డ్రాప్ అవుట్ అయిన ముగ్గురు విద్యార్థులను కొల్చారం కేజీబీవీలో చేర్పించినట్లు ఎంఈవో నీలకంఠం తెలిపారు.

●**వెల్దుర్తి:** మండల పరిధిలోని నెల్లూరులో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, యూనిఫామ్‌లను ఎంఈవో యాదగిరితో కలిసి అందజేశారు.

●**చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట మండల కేంద్రంతోపాటు సూరారం, చందంపేట తదితర గ్రామాల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సరస్వతీ విగ్రహానికి పూజలు చేసి, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.



కంది: చేర్యాల ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి

●**పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-9లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

●**చిలప్‌చెడ్:** మండలం పరిధిలోని చండూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు గురివినాయుడు పేర్కొన్నారు.

●**మనోహరాబాద్:** కాళ్లకల్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మండల నోడల్ అధికారి వెంకటస్వామి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి తెలిపారు. అలాగే రంగాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గీతాశ్రీ, అర్చన, అఖిత నేషనల్ మీన్స్‌కమ్ స్కాలర్‌షిప్(ఎన్ఎమ్ఎమ్ఎస్)కు ఎంపికైనట్లు ప్రధాపాధ్యాయుడు సంజీవరావు తెలిపారు.

●**చేగుంట:** చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లి, రెడ్డిపల్లి, పోలంపల్లి ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయులు చిట్టబోయిన సత్యనారాయణ, వవాత్ సురేష్, కర్రె సిద్ధిరాములు పాల్గొన్నారు.

కుబేర్ పద్ధతిలో వేతనాలు ఇవ్వడంపై హర్షం

- సీఎం రేవంత్‌రెడ్డికి సెర్ప్ ప్రతినిధుల కృతజ్ఞతలు



రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సంగారెడ్డి రూరల్, జూన్ 14: సెర్ప్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి కుబేర్ పద్ధతిలో వేతనాలు అధికారికంగా ఇవ్వడంపై ఆ సంఘం ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సమిష్టి కృషితో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌టీవీ, వీఏ, సీసీఏ వంటి అలవెన్స్‌లు, డీఏ ఏరియర్స్ జమయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న అలవెన్స్‌లు, డీఏ ఏరియర్స్‌ను జమ చేసినందుకుగాను, కుబేర్ సిస్టమ్‌లో వేతనాలు అమలు చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కలను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, కోశాధికారి వెంకట్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షికి ఎంపీ సన్మానం



దీపాదాస్ మున్షిని సన్మానిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, పక్కన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మంత్రి పొన్నం ప్రభాకర్

నారాయణఖేడ్, జూన్ 14: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీలను జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మంచి ఆధిక్యతతో గెలిచినందుకు వారు సురేష్‌షెట్కార్‌ను అభినందించారు. అనంతరం సురేష్‌షెట్కార్ వారికి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని మెదక్ ఎంపీకి వినతి



ఎంపీకి పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్, జూన్ 14: మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్లో రాయలసీమ, దేవగిరి, అజంతా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని బీజేపీ మండల నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును తన నివాసంలో శుక్రవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీకి పెన్నులు, పుస్తకాలను అందజేసిన సన్మానించారు. వీరిలో బీజేవైఎం జిల్లా నాయకులు అజయ్‌కుమార్, లక్ష్మణ్‌సింగ్ ఠాకూర్ ఉన్నారు.

కార్యకర్తలకు అండగా నిలిచే పార్టీ బీఆర్ఎస్: ఎమ్మెల్యే

జిన్నారం, జూన్ 14: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంగంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహిపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శుక్రవారం మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, నరేందర్, నగేష్‌యాదవ్, రాజేశ్ పాల్గొన్నారు.

రూ.11 కోట్ల అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం



సమావేశంలో చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్, కౌన్సిలర్లు

జిన్నారం, జూన్ 14: బొల్లారం మున్సిపల్ సమావేశంలో రూ.11 కోట్ల అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షత పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.11 కోట్లతో చేపట్టనున్న పనుల ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ మంగతాయారు, ఆర్వో శ్రీధర్, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, గోపాలమ్మ, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిపెట్టాలి: జడ్పీటీసీ

కల్హేర్, జూన్ 14: లాభసాటి పంట అయిన ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సిర్గాపూర్ జడ్పీటీసీ రాఘవరెడ్డి, గోద్రేజ్ కంపెనీ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు సూచించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భార్గవ్, అవినాశ్, రైతులు పాల్గన్నారు.

ఈద్గా పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

నారాయణఖేడ్, జూన్ 14: ఈనెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా ఖేడ్ పట్టణ శివారులోని ఈద్గాను ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ మాజీద్, మాజీ ఎంపీటీసీ ముంతాజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహేర్ అలీ, మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈద్గాతోపాటు పరిసరాలను పరిశీలించారు. ఈద్గాకు వెళ్లే రోడ్డు పక్కల, పరిసరాల్లో పెరిగిన పొదలను తొలగించాలని చైర్మన్ ఆదేశించారు.

ఎన్ఎమ్ఎమ్ఎస్‌కు 8 మంది విద్యార్థుల ఎంపిక

వెల్దుర్తి, జూన్ 14: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తి నుంచి 8 మంది విద్యార్థులు శుక్రవారం వెలువడిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎమ్ఎమ్ఎస్)కు ఎంపికయ్యారు. వీరికి ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున ఐదేళ్ల వరకు (ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం) వస్తాయి. వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన జి.అక్షయ, ఏ.శ్రీకీర్తన, జె.శ్రీలేఖ, ఏ.హర్షిత, ఎస్.మేఘన, పి.దినేష్, కే.ఈశ్వర్, ఎల్.రిశ్వంత్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు.

పంట పెట్టుబడి కోసం రైతుల ఎదురుచూపులు

కొల్చారం, జూన్ 14: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందా? గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తుందా? అని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్‌మాదిగ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొల్చారంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలం వచ్చినా రైతులకు పంట పెట్టుబడి సాయం గురించి ప్రభుత్వం నమోరు మెదపడం లేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

నులిపురుగుల నిర్మూలనకు అవగాహన కల్పించాలి

చేగుంట/చిన్నశంకరంపేట, జూన్ 14: ఈ నెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శుక్రవారం చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ అనిల్‌కుమార్ సమక్షంలో అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. 19 ఏళ్లలోపు ఉన్న ప్రతిఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. ఈనెల 20 జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా నులిపురుగుల నివారణ కోసం శుక్రవారం చిన్నశంకరంపేటలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించినట్లు వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు తెలిపారు.

'పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

చేగుంట, జూన్ 14: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని రామాయంపేట సీడీపీవో స్వరూపారాణి సూచించారు. శుక్రవారం చేగుంటలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేయలేని వారు ప్రతినెలా బరువు, వైద్య పరీక్షలను చేసుకోవాలన్నారు.

సమాచారం

'సురేష్‌షెట్కార్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలి'

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని గిరిజన రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రాథోడ్, ఖేడ్ నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకులు నెహ్రూనాయక్ కోరారు. శుక్రవారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

చేగుంట: ఈ నెల 21న చేగుంటలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ 19వ వార్షికోత్సవానికి హాజరుకావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు.

నవాయతన రామశిలా యాత్రను జయప్రదం చేద్దాం

సంగారెడ్డి రూరల్: జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో 16న నిర్వహించే నవాయతన రామశిలా యాత్రను జయప్రదం చేద్దామని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంతకిషన్, ప్రశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి మండలం పసల్‌వాది గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సహకార బ్యాంకు రుణాలపై అవగాహన

కంగ్టి, జూన్ 14: సహకార బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలపై శుక్రవారం కంగ్టిలో సిర్గాపూర్ డీసీసీ బ్యాంకు మేనేజర్ రవీందర్ అవగాహన కల్పించారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామన్నారు. వీటికి పదేళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. డ్వాక్రా రుణాలు, విద్య, వాహన, గృహ రుణాలు సైతం ఇస్తామని తెలిపారు. తమ బ్యాంకులో చేసే డిపాజిట్లపై అధిక వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి రెడ్డి, చెన్‌బసప్ప, వెంకట్‌రావు, సంతోష్ రెడ్డి, మొగులప్ప, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా చూడండి

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, జూన్ 14: వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండ చూడాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్ స్థాయి వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల డిమాండ్ మేరకు విత్తనాలను, ఎరువులను తెప్పించాలని, సరఫరాలో జాప్యం జరుగకుండా చూడాలన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తూ రైతులను మోసం చేస్తే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి, వ్యవసాయశాఖ అధికారులు ప్రవీణ, నవీన్, వినోద్‌కుమార్, లావణ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో పరిశ్రుభత పాటించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈద్గావద్ద, వార్డుల్లో పరిశుభ్రతతోపాటు, లేనిచోట వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ దీప్తిచంద్, ఏఈఈ సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారి నరేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంధ్య, నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం లాంటిది: డీఎంహెచ్‌వో



సంగారెడ్డిలోని హోప్ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

కోహీర్/సంగారెడ్డి అర్బన్/నర్సాపూర్, జూన్ 14: రక్తదానం ప్రాణదానం లాంటిదని సంగారెడ్డి జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కోహీర్ మండలంలోని వెంకటాపూర్‌లో గల గ్లోబల్ గ్రీన్ పరిశ్రమలో సంగారెడ్డి జిల్లా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నవీన్‌కుమార్, పరిశ్రమ అధికారులు వెంకటేష్, మోహన్‌గౌడ్, నెహ్రూ రమేష్, వెంకటేశ్వర్లు, దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి చౌరస్తాలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ డా.కృష్ణమూర్తి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్ మున్సిపల్‌లో బిల్ కలెక్టర్‌గా పనిచేసే పాపారావు 65 సార్లు రక్తదానం చేయగా.. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైతురాంనాయక్, మేనేజర్ సత్యనారాయణ ఆయనను సత్కరించారు.

ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారుల తనిఖీ

పుల్‌కల్, జూన్ 14: మండల కేంద్రమైన పుల్కల్‌లోని వివిధ రసాయన ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జోగిపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు అరుణ అధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి ఎం.సారికలు పుల్కల్‌లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, లక్ష్మీ వెంటేశ్వర ఫర్టిలైజర్స్, లక్ష్మీసాగర్‌లో డీసీఎంఎస్ అధ్వర్యంలో కొనసాగుతున్న రసాయన ఎరువుల దుకాణం, హర్ష రైతు సేవా కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేదని, వినియోగదారులకు అర్థమయ్యేలా నిల్వలను నమోదు చేయాలని దుకాణ డీలర్లకు సూచించారు. అనంతరం మండలంలోని గొంగ్లూరులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని జోగిపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు అరుణ శుక్రవారం ప్రారంభించారు.

పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్, జూన్ 14: పండుగలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. తూప్రాన్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో తూప్రాన్ సర్కిల్ పరిధి శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. తూప్రాన్ శాంతిభద్రతలకు ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. పండుగలను హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో తూప్రాన్ సీఐ రెడ్డబోయిన కృష్ణ, ఎస్ఐ శివానందం, మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి'

మెదక్ అర్బన్/హత్నూర, జూన్ 14: గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్పీ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్ మాట్లాడుతూ.. ఒక్క గోమాత కోటి దేవతలతో సమానమంగా పూజిస్తామన్నారు. గోవులను చంపడం చాలా బాధాకరమన్నారు. జిల్లాలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాకేష్, నరేందర్, సన్నీ, జిల్లా ఉపాధ్యక్షుడు రాహుల్, జిల్లా కార్యవర్గ సభ్యులు సతీష్, మార్గం రాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. హిందువుల ఆరాధ్య దైవమైన గోవుల వధను నియంత్రించి, అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం హత్నూర ఎస్ఐ సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ హత్నూర మండలాధ్యక్షుడు నాగప్రభుగౌడ్, యువ మోర్చా నాయకులు శ్రీకాంత్, పాండు తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

దౌల్తాబాద్ తైబజార్ వేలం రూ.10.90 లక్షలు

హత్నూర, జూన్ 14: హత్నూర మండలంలో ప్రధాన వ్యాపార కేంద్రమైన దౌల్తాబాద్ తైబజార్‌కు శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వేలంపాట నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శంకర్ పర్యవేక్షణలో గ్రామపంచాయతీ కార్యదర్శి బాలరాజ్ ఈ వేలంపాట నిర్వహించగా... పలువురు వేలంపాటలో పోటీపడ్డారు. దౌలాపూర్‌కు చెందిన చింత ప్రవీణ్ రూ.10.90 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

జహీరాబాద్, జూన్ 14: జహీరాబాద్ పట్టణంలో పుట్టగొడుగుల్లా వెలిసి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఈ విషయమై ఎంఈవో బస్వరాజ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అడ్మిషన్లు, డొనేషన్ల పేరుతో ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వాహకులు పేదలను దోపిడీ చేస్తున్నా. విద్యాశాఖ మౌనంగా ఉండడమేంటని ప్రశ్నించారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అంగవైకల్యం, తదితర లోపాలున్న విద్యార్థులను చేర్పించుకోవడం లేదన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం, 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం వికలాంగులను పాఠశాలల్లో చేర్పించుకోవాలని ఉన్నా.. అడ్మిషన్ విషయంలో నిరాకరిస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు రాజు, మశ్చేందర్, తదితరులు పాలొన్నారు

'ఆలేరు ఎమ్మెల్యేను క్యాబినెట్‌లోకి తీసుకోవాలి'

నారాయణఖేడ్, జూన్ 14: రాష్ట్రంలో ఆలేరు నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఏకైక కురుమ సామాజికవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను రాష్ట్ర క్యాబినెట్‌లోకి తీసుకోవాలని కురుమ సంఘం యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సిందోల్ దశరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన కురుమ సంఘం సమావేశంలో మాట్లాడారు. ఐలయ్య నల్లగొండ జిల్లాలోనే 50 వేల పైచిలుకు ఆధిక్యతతో గెలిచాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐలయ్యను మంత్రి వర్గంలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నియోజకవర్గ, మండలాల నాయకులు దత్తు, బీరప్ప, జ్ఞానేశ్వర్, విష్ణు, రమేష్, సంజీవ్, శంకర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఉచితంగా వైకుంఠ రథం సౌకర్యం

- తూప్రాన్ మున్సిపల్ సమావేశంలో తీర్మానం

తూప్రాన్, జూన్ 14: తూప్రాన్ పట్టణ ప్రజలకు ఉచితంగా వైకుంఠ రథం సౌకర్యం కల్పించాలని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ అధ్యతన సమావేశం నిర్వహించారు. కమిషనర్ ఖాజా మోయిజోద్దీన్ తీర్మానాలను వివరించారు. వానాకాలం ప్రారంభమైనందున ముందుస్తుగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు వార్డులో మొబైల్ నంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో సర్వేనంబర్ 447లో మోడ్రన్ దోబీఘాట్ నిర్మాణం కోసం దరఖాస్తు చేయడంతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపేందుకు తీర్మానించారు. తూప్రాన్ పట్టణంలోని పలు వీధుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేశారు. నర్సాపూర్ రోడ్డు నుంచి బ్రాహ్మణపల్లి మీదుగా పడాలపల్లి వరకు రోడ్డును 60 అడుగులకు విస్తరించేదుకు కలెక్టర్, రోడ్లు భవనాలశాఖకు ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ వివరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మేనేజర్ రఘువరన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఊబ చెరువుకు రక్షణ కల్పించాలంటూ కలెక్టర్‌కు వినతి

సంగారెడ్డి రూరల్, జూన్ 14: సదాశివపేట పట్టణంలోని ఊబ చెరువును కొందరు రియల్టర్లు ఆక్రమించుకుంటున్నారని, చెరువుకు రక్షణ కల్పించి కాపాడాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) చైర్మన్ సత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సదాశివపేట పట్టణ ప్రజలకు ఎన్నోవిధాలుగా ఉపయోగంలో ఉన్న ఊబ చెరువు (మినీ ట్యాంక్ బండ్)ను ధ్వంసం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్‌కు రోడ్డు వేశారన్నారు. వెంచర్‌కు అనుమతులు రద్దుచేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులపై, వెంచర్‌కు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర నాయకురాలు గీత, టీజేఏసీ సదాశివపేట పట్టణ అధ్యక్షుడు ఖాజాపాషా, నాయకులు ఉన్నారు.